క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి సహకరించండి



తహసిల్దార్ రాధాకృష్ణకు సమస్య వివరిస్తున్న హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు

పాలకొండ రూరల్: స్థానిక వడమ ప్రాంతంలో గల కల్యాణి కోనేటి పరిసరాల్లో శరవేగంగా జరుగుతున్న శివాలయ నిర్మాణానికి అధికారులు సహకరించాలని హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు, వడమ ప్రాంతవాసులు కోరారు. ఆలయ నిర్మాణ పనులను ఇటీవల రెవెన్యూ అధికారులు నిలిపివేయడంపై తహసీల్దార్ రాధాకృష్ణను సోమవారం కలిసి సమస్య వివరించారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే పనులు ప్రారంభించామని, అధికారులు సహకారం అందించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



ఎంఈవోకు స్వాగతం పలుకుతున్న ఎమ్మార్సీ సిబ్బంది

గరుగుబిల్లి: మండల విద్యాశాఖాధికారిగా బి.వెంకటరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సీతంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండగా ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఎమ్మార్సీ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

వైద్యాధికారిగా..



స్థానిక పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వైద్యాధికారిగా ఎస్ఎంకే తిరుమల ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు ఆస్పత్రి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ సావిత్రికి సమస్య వివరిస్తున్న సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రమైన పాలకొండలో విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడాలని దళిత నాయకుడు బి. మోహనరావు, పౌరసంఘ నాయకుడు దుంపల రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి సావిత్రికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గల విలువైన స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాగే ఇతర ప్రభుత్వ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడిందన్నారు.

నేడు శాకంబరి దేవిగా పోలమాంబ దర్శనం

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు మంగళవారం శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో బి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించనున్నట్లు ఈవో చెప్పారు. భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

బియ్యం శుద్ధి చేసి వంట చేయాలి

సీతానగరం: మండలంలోని పాఠశాలలు, వసతిగృహాలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని శుద్ధిచేసి వంటలు చేయాలని ఎంఈఓ జి. సూరిదేముడు అన్నారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట వసతి గృహంలో సోమవారం నిర్వహించిన వంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహాల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వసతిగృహ సిబ్బందిపై ఉందన్నారు. అన్ని పాఠశాలల్లో నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కాశీపేటలో 104 వైద్య శిబిరం

సీతానగరం: మండలంలోని కాశీపేట గ్రామంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ సీజన్‌లో జ్వరం, దగ్గు, డయేరియా ఉంటే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రోగులను తనిఖీ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎంబీ పురంలో కాడెద్దులతో దుక్కు దున్నుతున్న రైతు



కుమ్మరిగుంటలో ట్రాక్టర్‌తో దమ్ము



ఎంబీ పురంలో పొలంలో పార పని చేస్తున్న రైతు



పనసనందివాడలో ఉభాల కోసం వరినారును కట్టలు కడుతున్న రైతులు



వరినారును ఉభాలకు అనుగుణంగా పొలమంతా వేస్తున్న రైతులు



తలవరంలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న మహిళా రైతులు

ఊపందుకున్న ఉభాలు..

వీరఘట్టం మండలంలో ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండంతో వరి పంటకు సంబంధించి ఉభాలు జరుగుతున్నాయి. పలువురు రైతులు దమ్ము ట్రాక్టర్లుతో, కాడెద్దులతో పొలాలను దున్నుతుండగా.. కొంతమంది ఉభాలకు గతంలో వేసిన వరినారును సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నారు. మరికొంతమంది రైతులు పొలం గట్లును చదును చేస్తున్నారు. అన్నీ పూర్తయిన పొలాల్లో మహిళలు వరినాట్లు వేస్తూ ఉత్సాహంగా ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. రింగ్ రోడ్డులో ఉన్న తెట్టంగి, నీలానగరం, కుమ్మరిగుంట, ఎంబీ పురం, పనసనందివాడ, తలవరం, తదితర గ్రామాల్లోని సుమారు 2,500 ఎకరాల్లో ఉభాలు జరుగుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య తెలిపారు. - వీరఘట్టం

మరమ్మతు పనులపై సర్వే చేయండి



మాట్లాడుతున్న ఏఈ రమేష్

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని 23 ట్రైబల్ వెల్ఫేర్ జీపీఎస్ పాఠశాలలు, రావాడ రామభద్రపురం, టీకే జమ్ము, పీటీ మండ, వనిజ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల భవనాల మరమ్మతు పనులపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఐటీడీఏ ఏఈ పి.రమేష్ ఆదేశించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశమై మాట్లాడారు. గిరిజన విద్యార్థుల విద్యాలయాల మెరుగు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఏ పాఠశాల, వసతిగృహంలోనైనా మరమ్మతు పనులుంటే వెంటనే చేయాలన్నారు. జియ్యమ్మవలస గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, నీలకంఠాపురం, చిలకలవానివలసలకు ఐసీడీఎస్ నిధులతో అంగన్‌వాడీ పక్కా భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీలకంఠాపురంలో రూఫ్ లెవల్ నిర్మాణం జరిగిందని, చిలకలవానివలసలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థల సేకరణ జరుగుతోందన్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.12 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. పందులవాని వలసలో విలేజ్ రిసోర్స్ సెంటర్‌ను రూ.8.75 లక్షల పీఎం జన్‌మన్ నిధులతో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే ద్రాక్షిణి గిరిజన గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.30 లక్షల మంజూరుకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు.

రాకపోకలకు ఇబ్బందులు..



శివారు గ్రామాలకు వెళ్లే రహదారి మధ్యలో ఏర్పడిన భారీ గోతులు

పాలకొండ రూరల్: పట్టణంలోని గాసీ వీధి మీదుగా అర్బన్ పరిధిలోని జగనన్న కాలనీకి చేరుకునే ప్రధాన రహదారి పూర్తిగా రూపు కోల్పోయింది. ఓ పక్క కిష్టప్ప కోనేరు మరోవైపు రోడ్డుపై భారీ గోతులతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాజాగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో నీరు నిల్వ ఉండిపోతుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఇదే రహదారి మీదుగా మండల పరిధిలోని గరుగుబిల్లి, లుంబూరు, ఓని, గుడివాడ, కొత్త ఊరుతోపాటు డెప్పిగూడ మీదుగా సీతంపేట మండలానికి రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

భామినిలో భారీ వర్షం



భామిని: మండల కేంద్రంతో పాటు బిల్లుమడ, బత్తిలి, తదితర ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. అయితే ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. ఉదయం తీవ్రమైన ఎండ కాయగా.. మధ్యాహ్నానికి వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. ఇదిలా ఉంటే బోర్ల వద్ద ఇప్పటికే వేసిన వరినాట్లుకు మాత్రం వర్షం వల్ల ఇబ్బందేనని పలువురు తెలిపారు.

వ్యవసాయ పనుల్లో బిజీబిజీ..



సీతారాంపురంలో వరినాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలాలు

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వరి ఉభాలు(వరినాట్లు వేయడం) జోరుగా జరుగుతున్నాయి. గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నెలకొన్న వాతావరణం వరినాట్లు వేసేందుకు అనుకూలంగా ఉండడంతో మండలంలోని సుంకి, పెద్దూరు, గరుగుబిల్లి, సీతారాంపురం, రావుపల్లి, చినగుడబ, బీవీ పురం, వల్లరగుడబ, ఎస్‌ఆర్ పేట, రావివలస, నాగూరు తదితర గ్రామాల్లో వరినాట్లు వేసే పనులు జరుగుతున్నాయి.

ఎరువులు అందించడంలో విఫలం

పాలకొండ: రైతులకు ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘ నాయకుడు ఖండాపు ప్రసాదరావు ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎరువుల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా రైతులకు కావాల్సిన ఎరువులను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలను కొనసాగించాలి

గరుగుబిల్లి: తమ గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలని గరుగుబిల్లి పంచాయతీ, హిక్కింవలస గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఈ పాఠశాలలో తక్కువ మంది విద్యార్థులు ఉన్నారనే కారణంతో 1, 2 తరగతులను ఫౌండేషన్ తరగతులుగా చేసి, మిగిలిన 3, 4, 5 తరగతులను గరుగుబిల్లి ఎమ్మార్సీ భవనం పక్కనే ఉన్న మోడల్ ప్రైమరీ పాఠశాలకు తరలించారు. దీంతో ఈ గ్రామ పాఠశాల నుంచి ఆ పాఠశాలకు వెళ్లాలంటే కిలోమీటరు దూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో తమ గ్రామంలోనే విద్యార్థులు చదువుకునేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలను గ్రామంలోనే నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎల్విన్‌పేట సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎల్విన్‌పేట సీఐ బి.హరి సూచించారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెంట్ వంటి మత్తు పదార్థాలకు బానిసలైన ఎంతోమంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. ఉన్నత స్థాయిలో స్థిరపడి తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న రెవెన్యూ సమస్యలు

జియ్యమ్మవలస రూరల్: మండల పరిధిలో సరిపడ రెవెన్యూ సిబ్బంది లేకపోవడంతో కుప్పలుతెప్పలుగా రెవెన్యూ సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉద్యోగుల బదిలీల్లో మండల తహసీల్దారు కార్యాలయం నుంచి కొంత మంది అధికారులు వివిధ ప్రాంతాలకు బదిలీ కాగా వారి స్థానంలో రావాల్సిన అధికారులు రాలేదు. దీంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దారు కార్యాలయానికి వచ్చే గ్రామస్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇలా రోజూ తిరగాల్సి వస్తోందని, సరిపడ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు. మండలంలో మొత్తం 25 సచివాలయాల పరిధిలో 58 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఆయా గ్రామాల భూ సమస్యల పరిష్కారానికి 25 మంది వీఆర్వోలు అవసరం కాగా కేవలం 20 మంది మాత్రమే ఉన్నారు. మేజరు గ్రామాలైన జియ్యమ్మవలస, పెదబుడ్డిడి, కన్నపుదొరవలస, కుదమ, గెడ్డతిరువాడ, బిత్తరపాడు గ్రామాలకు ఇంతవరకు వీఆర్వోలు లేకపోవడం గమనార్హం. ఈ మేరకు వీఆర్‌వోలను నియమించి, సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు చిన మంగళాపురంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు గాను మండలంలోని చిన మంగళాపురంలో 'బాబు ష్యూరి టీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవా రం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు.

వర్మీకంపోస్ట్ ద్వారా పంచాయతీలకు ఆదాయం



ఎస్‌డబ్ల్యూపీసీలో ఎరువుల తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం ఎస్‌డబ్ల్యూపీసీ(సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్)ను ఎంపీడీవో జి.పైడితల్లి సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇంటింటి నుంచి సేకరిస్తున్న చెత్తను ఇక్కడకు తరలించి, వర్మీకంపోస్ట్(సేంద్రియ ఎరువు) తయారు చేయాలని తెలిపారు. ఇలా తయారైన వర్మీకంపోస్ట్‌ను రైతులకు సబ్సిడీపై అందజేసి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు. ప్రతి ఎస్‌డబ్ల్యూపీసీలో ఇదే జరగాలని, పంచాయతీల ఆర్థిక పుష్టికి అందరూ సహకరించాలని కోరారు. ఆమె వెంట సర్పంచ్ ఎ.తవిటినాయుడు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తదితరులు ఉన్నారు.

పేదరిక నిర్మూలనకు చర్యలు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు చర్యలు చేపట్టడం జరుగుతోందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండలంలోని సంతోషపురంలో పీ4 సర్వేపై గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల్లోనూ నిరుపేదలను గుర్తించడం జరిగిందని, వారి పేదరికం నిర్ధారణపై ఇప్పుడు సభలు పెట్టి, అభిప్రాయాలు సేకరించడం జరుగుతోందన్నారు. నిరుపేదలను ఉన్నత స్థాయి కలిగిన వారికి దత్తత ఇచ్చి వారు అందజేసే సాయం ద్వారా నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మలచడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ. తవిటినాయుడు, కార్యదర్శి రాజేష్, ఎంపీటీసీ సభ్యులు, డిప్యూటీ ఎంపీడీవో గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య భూ వివాదం..

- 17 ఏళ్లుగా కొలిక్కిరాని సమస్య
- దృష్టి సారించని యంత్రాగం

వీరఘట్టం: మండలంలోని చినగోర రెవెన్యూ పరిధిలో సాగు చేస్తున్న 25 ఎకరాల ప్రభుత్వ భూములు తమవేనని జియ్యమ్మవలస మండలం ఏనుగులగూడ, గడ సింగుపురం గ్రామాలకు చెందిన రైతులు అంటున్నారు. అయితే ఆ భూములు వారివి కాదని.. ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని వీరఘట్టం మండలం సంత-నర్సిపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అంటున్నారు. ఈ నేపథ్యంలో వీరంతా నెల రోజులుగా పలు సందర్భాల్లో వివిధ ప్రజా సంఘాల నాయకులతో కలసి వీరఘట్టం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేస్తున్నారు. అయితే సోమవారం ఇదే భూమి వద్ద ఇరువర్గాల మధ్య తగాదా చోటు చేసుకుంది. వీరిలో పలువురు మహిళలకు స్వల్ప గాయాలు కూడా అయ్యాయి. దీంతో ఇరువర్గాల వారు వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. స్థల వివాదం కావడంతో ఈ విషయాన్ని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎస్సై జి..కళాధర్ తెలిపారు. చాలా రోజులుగా ఈ సమస్య ఉండడంతో ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించేసినట్లు ఎస్సై తెలిపారు.



ఏం జరిగింది....

వీరఘట్టం మండలం చిన్నగోర గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 17లో 450 ఎకరాల కొండ పోరంబోకు ఉంది. దీన్ని సబ్ డివిజన్ చేసి సంత-నర్సిపురం గ్రామానికి చెందిన 150 మంది లబ్ధిదారులకు 150 ఎకరాల భూమిని (ఒకొక్కరికీ ఎకరా చొప్పున) దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008లో ఇచ్చారు. మిగిలిన భూమి చిన్నగోర గిరిజనులు సాగు చేస్తున్నారు. అయితే ఈ 150 మందికి పట్టాలు ఇచ్చారే తప్ప.. ఆ భూమి ఎక్కడ ఉందో ఈ రోజుకు కూడా అధికారులు లబ్ధిదారులకు అప్పగించలేదు. అలాగే చిన్నగోర రెవెన్యూ పరిధిలో ఉన్న సుమారు 25 ఎకరాల భూమిని జియ్యమ్మవలస మండలం ఏనుగులగూడ, గడసింగుపురంనకు చెందిన కొందరు సాగు చేస్తున్నారు. ఈ సాగు చేస్తున్న భూములకు సంబంధించి కొంత మంది వద్ద పట్టాలు ఉన్నాయని.. మిగిలిన భూమికి డీ పట్టాలు ఇప్పించాలని వీరంతా వీరఘట్టం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇలా చిన్నగోర గిరిజనులు, సంత-నర్సిపురం గ్రామానికి హరిజనులు, జియ్యమ్మవలస మండలం ఏనుగులగూడ, గడసింగుపురంనకు చెందిన గిరిజనులు భూ సమస్యపై పోరాటాలు చేస్తున్నారు. ఈ భూ సమస్య పరిష్కరించకపోతే భవిష్యత్‌లో మరిన్ని తగాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

కొద్ది రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం..

చినగోర రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో సోమవారం ఇరువర్గాల మధ్య తగాదా జరిగినట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. కొద్ది రోజుల్లో పోలీస్ బందోబస్తు నడుమ సర్వే చేపట్టి అసలైన లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేస్తాం.

– ఏఎస్.కామేశ్వరరావు, తహసీల్దార్, వీరఘట్టం

దళితులకు భూములు అప్పగించండి..

భామిని: మండలంలోని లివిరిలో 30 మంది దళితులకు చెందిన భూమిని ఒకరు ఆక్రమించుకున్నారని, ఆ భూమిని తిరిగి దళితులకు అప్పగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 1984లో అప్పటి ప్రభుత్వం 30 మంది దళితులకు డీ పట్టా భూములు ఇచ్చిందని తెలిపారు. ఆ సమయంలో అనకాపల్లి నుంచి వచ్చిన వలస రైతు గుర్రపు వరప్రసాద్ లివిరిలో కొంత జిరాయితీ భూమి కొని అందులో దళితులకు చెందిన డీ పట్టా భూములు కలుపుకున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితులకు భూములు అప్పగించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు.

ఇద్దరి అరెస్ట్

సీతంపేట: దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో సారా విక్రయిస్తుండగా ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మస్తాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిటుకుపాయిగూడ సమీపంలో నిమ్మక రామారావు, బిడ్డిక సుమన్ సారా విక్రయిస్తుండగా సోమవారం పట్టుకున్నామని చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.